




# కరపత్రం

SINCE 2014

మంగళవారం మార్చి 24, 2026 | సంపుటి : 2 | సంచిక : 162 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





## విద్యుత్‌శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణం

### » రెండు కుటుంబాలకు కోటి చొప్పున చెక్కులు అందచేత

**హైదరాబాద్,మార్చి23 :**
విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందేశారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి పది లక్షలకు పెంచాం. సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ. 5 లక్షల బీమా వర్తిస్తుంది కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దని భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చాం అని ఈ సందర్భంగా సిఎం అన్నారు.విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించాం అన్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చొప్పున చెక్కులు రేవంత్ రెడ్డి అందచేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టాం అన్నారు.

### సకాలంలో ఉద్యోగులకు


## జీతాల చెల్లింపు

- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,మార్చి23 :**
ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు.మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం.

మిగతాద్ది 2 లో




### వాహన్ పోర్టల్ ప్రారంభం..

## ఇక RTA ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు..

## అంతా ఆన్ లైన్ లోనే..

- లైసెన్స్, రిజిస్ట్రేషన్, ట్రాన్స్‌ఫర్---all ఆన్‌లైన్‌లో
- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు
- తెలంగాణ సేవలు జాతీయ డేటాబేస్‌లోకి
- 20+ సేవలు దశలవారీగా అందుబాటులో
- 2% రెండో వాహన లైఫ్ టాక్స్ రద్దు
- వాహన ట్రాన్స్‌ఫర్, ఇంటర్‌స్టేట్ సేవలు సులభతరం



2 లో

లైసెన్స్, రిజిస్ట్రేషన్, కరెక్షన్, పేరు మార్పు.. ఇలా వాహనాలకు సంబంధించి ఏది కావాలన్నా ఇది వరకు ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఏజెంట్ల మాయాజాలంతో భారీగా చెల్లించుకోవాల్సి వచ్చేది. కానీ ఇక నుంచి ఆర్టీఏ ఆఫీసుకు వెళ్లకుండా ఆన్ లైన్ లోనే వెహికల్ కు సంబంధించిన పనులు పూర్తి చేసుకోవచ్చు. వాహన్ పోర్టల్ ప్రారంభం కావడంతో వాహనదారులకు ఆన్ లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.సోమవారం (మార్చి 23) వాహన్ పోర్టల్ సేవలను ప్రారంభించారు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. దీంతో ఇక నుంచి జాతీయ వాహన్ పోర్టల్ లో తెలంగాణ రవాణా సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాహన ఆన్ లైన్ రిజిస్ట్రేషన్, బదిలీ తదితర రవాణా శాఖ సేవలు సులభతరం కానున్నాయి.



2లో..

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

- » పిటిషన్: ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- » పార్టీ మార్పు వివాదం
- » స్పీకర్ నిర్ణయం రద్దు డిమాండ్
- » కౌంటర్ దాఖలు ఆదేశం

మిగతాది 2లో

## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్.



- ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు..స్పీడ్ ఆఫ్ డూయింగ్
- ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు
- ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

**అనకాపల్లి,మార్చి 23**
ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు.

2లో..

## క్యూనెట్ కేసులో 32 మంది నిందితుల అరెస్టు

**హైదరాబాద్:**
దేశ వ్యాప్తంగా రూ. కోట్ల మోసం చేస్తున్న క్యూనెట్ కేసులో 32 మందిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి.. నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.






## మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

- » రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదే
- » బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క

**హైదరాబాద్,మార్చి23 :**
తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ చర్చలు వాడివేడిగా సాగుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఖజానా సరిపోతోందని ఆమె ధ్వజమెత్తారు. పాండవులు సంపాదించింది కౌరవుల తద్దినానికే సరిపోయినట్లు.. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే మాకు సరిపోతోందని అంటూ ఆమె ఎద్దేవా చేశారు. హరీష్ రావు తన నియోజకవర్గంలోనే రైతులకు అప్పులు ఉన్నాయని చెబుతున్నారని, మరి ఫైనాన్స్ మినిస్టర్‌గా

2లో..



## ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలి రామచందర్‌రావు

**హైదరాబాద్:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తవుతున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భాజపా ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ..

## బడ్జెట్‌లో పెట్టినవి అమలు చేయకపోవడం సిగ్గుచేటు

### - హరీశ్‌రావు

**హైదరాబాద్:**



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు.“ మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదు”అని హరీశ్‌రావు అన్నారు.




## ‘క్యూనెట్’ కేసుల్లో సీసీఎస్ పోలీసుల సోదాలు

- » హైదరాబాద్, విశాఖ, బెంగళూరులో తనిఖీలు
- » తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో ఆపరేషన్ కొనసాగింపు
- » 20 మంది అదుపులోకి
- » 25 బృందాలతో దర్యాప్తు
- » ఎలక్ట్రానిక్ పరికరాలు, పత్రాలు స్వాధీనం

02

**హైదరాబాద్:**
మల్టీలెవెల్ మార్కెటింగ్ సంస్థ ‘క్యూనెట్’ కేసుల్లో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు సోదాలు చేపట్టారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో ఇవి కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరులోని ఆ సంస్థ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు పోలీసులు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల సీసీఎస్‌లో నమోదైన కేసుల ఆధారంగా 25 బృందాలు సోదాలు కొనసాగిస్తున్నాయి. తనిఖీల్లో పలు ఎలక్ట్రానిక్ పరికరాలు, కీలక పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం మార్చి 24, 2026

# ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..
# స్టీల్ సిటీకి ఫౌండేషన్.

మొదటిపేజీ తరువాయి
ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్.
అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷–లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷–లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷–లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷–లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. దానం పార్టీ మారిన వ్యవహారంపై స్పీకర్ తీర్పును కొట్టేయాలని పిటిషన్‌లో ఏలేటి కోరారు.
బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం.. కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

### వాహన్ పోర్టల్ ప్రారంభం..
## ఇక RTA ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు..

మొదటిపేజీ తరువాయి
కేంద్రం తీసుకొచ్చిన వాహన్ పోర్టల్ లో తెలంగాణ చేరడంతో.. రాష్ట్రవ్యాప్త వాహనాల సమాచారం జాతీయ డేటాబేస్‌లోకి వెళ్ళనుంది. దీంతో ఆర్టీఏ కార్యాలయాలపై ఒత్తిడి తగ్గనుంది. అంతర్రాష్ట్ర వాహనాల బదిలీ సులభతరం కానుంది.
వాహన దారులకు మరో గుడ్ న్యూస్ ఏంటంటే.. ఇవాళ్టితో (మార్చి 23) రెండో వాహనంపై 2 శాతం లైఫ్ టాక్స్ పన్ను రద్దు కానుంది. గతంలో కాలుష్యం నియంత్రణలో భాగంగా లైఫ్ టాక్స్ తీసుకొచ్చినప్పటికీ.. ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడంతో కొత్తగా వాహనాలు కొనేవారికి.. ఇది వరకు ఉన్న వాహనదారులకు కూడా ఉపశమనం లభించనుంది.
మొదటి దశలో కేవలం కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లను మాత్రమే ఆన్‌లైన్ చేయనున్నారు. దశలవారీగా మిగితా సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ కొత్త సాంకేతికతపై ఆర్టీఏ అధికారులు, సిబ్బంది, ఆటోమొబైల్ డీలర్లకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సాఫీగా సేవలు అందించేలా వారికి నైపుణ్యాన్ని పెంపొందించారు.

**దేశంలోని ఏ ప్రాంతాలకైనా బదిలీ..**

వాహన్ పోర్టల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వాహనదారులు 52 రకాల సేవలను ఆన్ లైన్ ద్వారానే పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా వాహనాల రిజిస్ట్రేషన్?లతో పాటు అమ్మినా, కొన్న తర్వాత ఓనర్ షిప్ బదిలీ ఆన్ లైన్ ద్వారానే నిర్వహించుకోవచ్చు. అలాగే, అంతర్రాష్ట్ర, జిల్లాలకు చెందిన వాహనాల బదిలీలకు సంబంధించి కూడా వాహనదారులు ఇక నుంచి ఎలాంటి ఎన్ ఓసీలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.
ఆటోమేటిక్ గా ఆన్ లైన్ లోనే బిదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. బండి బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ఈ సదుపాయం లభిస్తుంది. వాహనాలు చోరీకి గురైనా, రోడ్డు ప్రమాదాలు వంటివి జరిగినా కూడా ఆచూకీ కనిపెట్టేందుకు కూడా వాహన్ ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

## క్యూనెట్ కేసులో 32 మంది నిందితుల అరెస్టు

మొదటిపేజీ తరువాయి
నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు, వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు 30 బృందాలుగా విడిపోయి ఆపరేషన్ నిర్వహించినట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులు కావడం గమనార్హం. ఇప్పటివరకు నమోదైన 4 కేసుల్లో 11 మంది బాధితులకు దాదాపు రూ.75 లక్షల నష్టం జరిగినట్లు గుర్తించామని సజ్జనార్ మీడియాకు తెలిపారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ కోరారు. ఇలాంటి పథకాల్లో చేరడం, ఇతరులను చేర్పించడం చట్టరీత్యా నేరమని, బాధితులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

మొదటిపేజీ తరువాయి
ఉండి కూడా పదేళ్లలో ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారని సీతక్క ప్రశ్నించారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను వంచించిందని, ఇప్పుడు ఆరు నెలల తమ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమమే నిధులు, నియామకాల కోసం జరిగిందని గుర్తు చేసిన సీతక్క, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ గ్యారెంటీ ఇచ్చిందని నిలదీశారు. కేవలం నోటిఫికేషన్లు ఇస్తే సరిపోదని, తాము అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు , నూతనంగా ప్రకటించిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. మీరు పదేళ్లలో ఎన్ని ఇళు
ల్ల ఇచ్చారో లెక్క చెప్పండి.. మేము
ఈ రెండేళ్లలో ఎన్ని ఇస్తామో చూపిస్తాం అని ఆమె సవాలు విసిరారు. హరీష్ రావు పడుతున్న బాధ అంతా అధికారం పోయిందనే తప్ప, ప్రజల మీద ప్రేమతో కాదని సీతక్క వ్యాఖ్యానించారు. సీటు మారగానే చరిత్ర మారిపోదని, పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేయని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆమె సూచించారు.

## ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలి

మొదటిపేజీ తరువాయి
ఆరు గ్యారంటీల్లో ప్రజలకు ఒక్కటి కూడా చేరడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. మిగతా గ్యారంటీలన్నీ పక్కనబెట్టి, అమలు చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తోందన్నారు. "రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా కింద ఇంకా ఎకరానికి రూ.45 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్ అనిశ్చితిలో పడింది. నిరసన చేస్తామని తెలిసి అర్ధరాత్రి నుంచే భాజపా నాయకులను గృహనిర్బంధం చేశారు. వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వేలాది కార్యకర్తలను మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా" అని రామచందర్‌రావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### సకాలంలో ఉద్యోగులకు
## జీతాల చెల్లింపు

మొదటిపేజీ తరువాయి
రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించి 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకే పదవీ విరమణ వయసు పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

**- తక్షణం కోర్టు ముందుకు రావాలని ఆదేశం**

రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము.. . ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

**-కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టు విచారణ**

తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ పొడిగింపునకు సంబంధించి అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్దంగా ఉన్నారని, సీట్లు వృథా కాకుండా చూడాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపు అంశంపై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని, అయితే ఆ తేదీకి ఆంధ్రప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి.

## మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం

### క్యూనెట్ సంస్థ వ్యవహారాలపై సిపి సజ్జన్నార్

క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సోమవారం క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టా÷–గ్గ్గ÷ట్ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ.5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించు కొన్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టా÷–గ్గ్గ÷ట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్గ్గ÷నాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు. నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 32 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నారని ప్రస్తావించారు. చాలామంది ఇండియన్ డైరెక్ట్ సె÷–లలెర్స్‌గా ఏర్పడి బిజినెస్ చేస్తున్నారని అన్నారు. డైరెక్ట్ ప్రోడక్ట్ సెల్లింగ్ పేరుతో మనీ స్కాంలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## పెన్షనర్లను వేధిస్తున్న ప్రభుత్వం
## వారి బకాయల చెల్లింపులో నిర్లక్ష్యం

**- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్**

ప్రభుత్వ ఉద్యోగలు జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా , కల్వకుంట సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు రూ. 700 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పి , ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారురని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

# అమరవీరుల స్ఫూర్తితో యువత ముందుకు -- ఎస్.ఆర్.ఆర్. కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో షాహిద్ దివస్ పాదయాత్ర




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 23**

మేరా యువభారత్ , ఎస్.ఆర్.ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో షాహిద్ దివస్ సందర్భంగా ఘనంగా పాదయాత్ర నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కోఆర్డినేటర్ వెంకట రాంబాబు మాట్లాడుతూ, అమరవీరుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖదేవ్ వంటి వీరుల త్యాగాలు నేటి యువతకు ప్రేరణగా నిలవాలని అన్నారు. వారి స్ఫూర్తిని అనుసరించి యువత సమాజంలో తమ బాధ్యతను నెరవేర్చినప్పుడే దేశం మహోన్నత స్థితికి ఎదుగుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య మాట్లాడుతూ, అమరవీరుల త్యాగాలను విద్యార్థులు ఎల్లప్పుడూ గుర్తుంచుకొని, వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవడం ద్వారా తమ జీవితాలను సార్థకంగా మార్చుకోవాలని సూచించారు.కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యతలపై అవగాహన కలిగించేందుకు ఎస్.ఆర్.ఆర్ కళాశాల నుండి వర్క్ షాప్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్జున్, ఎలిజబెత్ రాణి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమర్థవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, సత్య ప్రకాష్, సోము నరసయ్య , అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిబాబు కార్యదర్శి గా సహేందర్ రెడ్డి




**కరపత్రం ప్రతినిధి మంథని, మార్చ్ 23 :**

మంథని బార్ అసోసియేషన్ కు సోమవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా కె వి ఎల్ ఎన్ హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సయేందర్ రెడ్డి ఎన్నికైనారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా కేతిరెడ్డి రఘోత్తం రెడ్డి, కార్యదర్శిగా కటుకం శ్రీనివాస్, కోశాధికారిగా సుభాష్, లైబ్రరీ కార్యదర్శిగా రాచర్ల రాజేందర్, సాంస్కృతిక కార్యదర్శిగా ఆర్ల నాగరాజు, ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా సైకం భాస్కర్ రెడ్డి, లోకే రాధాకిషన్, శ్రీలక్ష్మి, శభానా లు ఏకగ్రీవముగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది కూ సత్యనారాయణ తెలిపారు.

# మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్ అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

**- రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు**

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది.మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

# మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కన్నుమూత

అనంత జిల్లా కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కన్నుమూశారు.. ఆయన వయస్సు 81 సంవత్సరాలు.. శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన ఆరేళ్ల పాటు పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పనిచేశారు. కళ్యాణదుర్గం మండలం గరుడాపురం పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగారు. నెల రోజులుగా గుండే, శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతూ.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇవాళ తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమంతరాయ చౌదరి స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు ..

# అన్ని వర్గాలకు కాంగ్రెస్ అన్యాయం!

- బడ్జెట్ అంకెల గారడీ
- బీసీలను మళ్ళీ మోసం చేసిన రేవంత్ సర్కార్
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 23**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని విస్మరించి, బడ్జెట్లో నిధుల కేటాయింపులో బీసీలను మోసం చేసిందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్ ధ్వజమెత్తారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 10 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం మచిలీబజార్ నందు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులి రజినీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను, మైనార్టీలను మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీ లకు బడ్జెట్ లో ఏడాదికి 20 వేల కోట్లు కేటాయిస్తా అని హామీ ఇచ్చి. .. ఈ బడ్జెట్ లో కేవలం 11 వేల కోట్లు కేటాయించి బీసీ లను ఉద్దేశపూర్వకంగా మోసం చేసిందని ఆరోపించారు. మూడు బడ్జెట్ లు కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధులు కేవలం 33 వేల కోట్లు మాత్రమే అని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ లకు ఇచ్చిన హామీ ప్రకారం 60 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సిందే... లేని పక్షంలో బీసీ పక్షాన బీఆర్ఎస్ పార్టీ, బీసీ ప్రజా సంఘాలు పోరాడుతాయన్నారు.
మైనార్టీల సంక్షేమానికి అధిక నిధుల కేటాయింపు చేయకపోవడం వారికి అన్యాయం చేయడమే అవుతుందని అన్నారు. 6 గ్యారంటీల అమలుకు అరకొర నిదులే కేటాయించి తెలంగాణ సమాజాన్నే కాంగ్రెస్ వంచించిందని తెలిపారు. దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధుల ఊసే లేదు అని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రం కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చింది. ఇప్పుడు వాటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపడం లేదు దానికి సాక్ష్యమే ఈ బడ్జెట్ అని అన్నారు. బడ్జెట్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి కి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం ఇక్కడి పాలకుల పని తనానికి నిదర్శనం అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉడుతల సారంగపాణి, డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ ఖలీల్, మైనార్టీ అధ్యక్షుడు ఎండి కాజా,మహిళా నాయకురాలు వలస ప్రమీల, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సంపతి రఘు, సోషల్ మీడియా ఇన్చార్జ్ వంగ రాము, డివిజన్ బీసీ నాయకులు భయ్యా శోభన్, పులి రవీందర్ పులి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గా సహోదర్ రెడ్డి ఘన విజయం

- రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సహోదర్ రెడ్డి ని గజమాలతో ఘనంగా సన్మానించిన న్యాయవాదులు, బార్ అసోసియేషన్






**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 23**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ పోటీలో ఉమ్మడి వరంగల్ జిల్లా శ్రీనుంచి 11 మంది న్యాయవాదులు బరిలో నిలవగా . ఇందులో సీనియర్ న్యాయవాది ఎం సహోదర రెడ్డి, ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఘన విజయం సాధించారు. సోమవారం హనుమకొండ పది కోర్టు ల భవనం ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమం లో సహోదర్ రెడ్డి ని, న్యాయవాదులు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు గజమాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా సహోదర్ రెడ్డి ఘన విజయం సాధించడం న్యాయవాదుల వర్గంలో ఆనందాన్ని కలిగించింది. న్యాయ వృత్తిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సహోదర రెడ్డి, న్యాయ సేవలను ప్రజలకు చేరవేయడంలో ఎప్పటినుంచో కృషి చేస్తున్నారు. ఆయన సాధించిన ఈ విజయం న్యాయవాదుల ఐక్యతకు, విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.
రెడ్డి న్యాయ రంగంలో విశేష అనుభవం కలిగిన వ్యక్తిగా, పేద, అణగారిన వర్గాలకు న్యాయం అందించడంలో ముందుంటూ సేవలు అందిస్తున్నారన్నారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడం, వారి సంక్షేమం కోసం కృషి చేయడం తన ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, ప్రముఖులు సహోదర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో బార్ కౌన్సిల్ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, న్యాయవాదుల హక్కులు పరిరక్షించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సహోదర్ రెడ్డి విజయం భవిష్యత్తులో న్యాయరంగ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అంబరీష్, జిల్లా కోర్టు పిపి పోతరాజు రవి, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రజెంట్ సుధీర్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జయపాల్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, న్యాయవాదులు శ్రీధర్ రెడ్డి, గురుమిళ్ళ రాజు, చంద్ర ప్రకాష్, సీనియర్ ఈసీ మెంబర్ సురేష్, స్పోర్ట్స్ సెక్రటరీ శివప్రసాద్, న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వివక్షకు నిరసనగా... రేపు జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్"



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మార్చి 23**

జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈనెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్- ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు.ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్-ఐఅండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో రాష్టవ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రాచీన కళలను ఆదరించాలి

- బిజెపి విశ్వకర్మ రాష్ట్ర కన్వీనర్ పూసల బ్రహ్మచారి




**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మార్చి 23**

ప్రాచీన కళలను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిజెపి విశ్వకర్మ రాష్ట్ర కన్వీనర్, పోచమ్మ ముత్యాలమ్మ దేవాలయ చైర్మన్ పూసల బ్రహ్మచారి అన్నారు. సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ ఆధ్వర్యంలో కళ్యాణ్ యాంఫిథియేటర్ లో నిర్వహిస్తున్న 'వసంతోత్సవం 2026' కళా ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు ముఖ్య అతిథిగా బ్రహ్మచారి పాల్గొని సాకేత్ కాలనీ జాయింట్ సెక్రటరీ రవీందర్ రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ వ్యవస్థాపకురాలు పద్మా కళ్యాణ్ మరుగున పడిపోతున్న కళలను భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తూ.. కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే అద్భుతమైన కథాగాన కళారూపం 'బుర్రకథ' ప్రదర్శించడం సంతోష దాయకమన్నారు. సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ ప్రధాన సలహాదారులు లయన్ డాక్టర్ సింగిశెట్టి సత్యనారాయణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ వ్యవస్థాపకురాలు పద్మా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# ప్రజా ప్రభుత్వం... ప్రజా బడ్జెట్ ను ప్రవేశ పెట్టింది

- 6గ్యారెంటీల అమలుకు 50వేల 713 కోట్ల కేటాయింపు
- వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ నిధుల కేటాయింపు జరిగింది
- ప్రతిపక్షాలు ఉనికి కోసమే చౌకబారు విమర్శలు
- రాష్ట్రంలోని కోటి 15లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ భీమా పథకం వర్తింపు
- ఈ ఏడాది కొత్తగా 2లక్షల పెన్షన్లు మంజూరు
- దేవాదులకు రూ. 1000 కోట్లు కేటాయించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరుతా...



కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 23

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఊయోగపడే బడ్జెట్ ను రూపొందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంఅసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి దోహదడే బడ్జెట్ అని కొనియాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రూ. 3 లక్షల 24 వేల కోట్ల బడ్జెట్ లో సోషల్ సర్వీస్ పైన లక్షా 05 వేల ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రెండవ సింహ భాగం అప్పులకు మిత్తిలు కట్టెందుకే ఖర్చు అవుతున్నాయని అన్నారు. అలాగే 6గ్యారెంటీల అమలుకు 50 వేల 713 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఉనికి కోసమే బడ్జెట్ పై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ళు అధికారంలో ఉండి 8లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని అన్నారు. గడిచిన 12 ఏళ్లలో తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వని బీజేపీ కూడా బడ్జెట్ పై విమర్శలు చేయడం విడ్డురంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చట్టబద్దంగా, న్యాయబద్దంగా వచ్చేవి కాకుండా అదనంగా ఒక్క రూపాయి అయినా ఇచ్చారో బీజేపీ మంత్రులు, ఎంపిలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటూ సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ కూడా కొత్త పథకాలకు శ్రీకారం చూడుతోందని తెలిపారు. రాష్ట్రంలోని కోటి 15లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ భీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి 5లక్షల భీమా సదుపాయం కలగనుందని తెలిపారు. ఈ పథకం దేశంలోనే మొట్ట మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు కాబోతుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేనన్ని గురుకులాలు మన రాష్ట్రంలోనే ఉన్నాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు తోడు ఈ విద్యా సంవత్సరం నుండి తెలంగాణ పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే విద్యా రంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా 2లక్షల పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా బడ్జెట్ రూపొందించిన సీఎం రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క గారికి రాష్ట్ర ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. సాగు నీటి రంగానికి పెద్ద పీట వేస్తున్న తరుణంలో దేవాదుల పథకానికి 1000 కోట్లు కేటాయించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరానున్నట్లు తెలిపారు. దేవాదుల పనులను పూర్తి చేస్తే 6లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. ఒక్క స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోనే లక్షా 24వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. నియోజకవర్గం లోని దేవాదుల అసంపూర్తి పనులను పూర్తి చేసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా నిలబెడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ, మార్కెట్ డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 31న భగవాన్ మహావీర్ 2625వ జయంతోత్సవాలు

- శ్రీ మహావీర్ జైన్ సేవ సంఘ్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు ప్రదీప్ సురానా



కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మార్చి 23

తాను గ్రహించిన శాశ్వత సత్యాన్ని ప్రజలకు బోధించిన జైనమత 24వ తీర్థంకరుడైన వర్ధమాన భగవాన్ మహావీర్ 2625వ జయంతోత్సవాలను 2026, మార్చ్ 31న సికింద్రాబాద్, ఇంపీరియల్ గార్డెన్స్ లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ మహావీర్ జైన్ సేవ సంఘ్, త్రినగర్, తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు ప్రదీప్ సురానా, పరస్ ర్యాంక, కిషోర్ ముతా, మహావీర్ టాటెడ్, జై ప్రకాష్ ముఖాన, విజయ్ సూరన, నేమి ముఖాన, పవన్ పాండియ, సురేష్ బోగ్రా, కైలాష్ మండోత్, ఘేవర్ కొఠారి, దినేష్ జైన్ లు హైదరాబాద్, బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్ లో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా భగవాన్ మహావీర్ 2625వ జయంతోత్సవల బ్రోచర్ ను వారు విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ భగవాన్ మహావీర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 31 తేదీన ఉదయం తొమ్మిది గంటలకు తాడ్ బాన్ హనుమాన్ దేవాలయం నుండి ఇంపీరియల్ గార్డెన్, సికింద్రాబాద్ వరకు మహావీరుని విగ్రహాన్ని అలంకరించిన రథయాత్ర మరియు "వర్గోద" వైభవోపేతమైన ఆధ్యాత్మిక ఊరేగింపు ను నిర్వహిస్తున్నట్లు అనంతరం ఉదయం పది గంటలకు ఇంపీరియల్ గార్డెన్ లో ఉత్సాహభరితమైన ధర్మ సభ జరుగుతుందని తెలిపారు. జంట నగరాల నుండే కాకుండా తెలంగాణ రాష్ట్ర నలుమూలలనుండి వేలాదిమంది జైన భక్తులు హాజరైతారని. పూజ్య జైన సన్యాసులు, సన్యాసినులు ధర్మ సభలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, శాంతి, కరుణ, వినయం, నిస్వార్థత మరియు ఆధ్యాత్మిక జాగృతి సందేశంతో జీవించాలనే లక్ష్యంతో ప్రార్థనలు చేస్తారని, భగవాన్ మహావీరుని బోధనలు జైన తత్వశాస్త్రానికి మూల సూత్రాలుగా ఉన్నా అహింస, సత్యం, అస్తేయ, బ్రహ్మచర్యం, అపరిగ్రహం వంటివి బోధిస్తారని వారు తెలిపారు. ఈ ధర్మ సభలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ జైన మండళ్లు ఏర్పాటు చేసిన స్టాల్ లలో ప్రసాదం, పానీయాలు ఉచితంగా పంపిణి చేస్తారని వెల్లడించారు. ఈ రథయాత్ర, ధర్మ సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనీ వారు విజ్ఞప్తి చేసారు.

## మున్నూరుకాపు సంఘం యూత్ గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ గా ఎడ్ల విశాల్ పటేల్



కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మార్చి 23

తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం (పటేల్స్) యూత్ విభాగం గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ గా ఎడ్ల విశాల్ పటేల్ ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సోమవారం యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రాజ్ కుమార్ నియామకపు పత్రాన్ని అందజేశారు. గ్రేటర్ పరిధిలో మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎడ్ల విశాల్ పటేల్ తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ ఆధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్, టి.రాజ్ కుమార్ లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణలోని ఐటీఐలు, ఎన్ఎస్టీఐల స్థితిగతులు, వాటి ఆధునీకరణ అంశాలపై లోకసభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



కరపత్రం ప్రతినిధి మార్చి 23

తెలంగాణలోని ఐటీఐలు, ఎన్ఎస్టీఐల స్థితిగతులు, వాటి ఆధునీకరణ అవసరంపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ముఖ్యంగా వరంగల్ నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణలో పనిచేస్తున్న ఐటీఐలు, ఎన్ఎస్టీఐల సంఖ్య, అందిస్తున్న కోర్సులు, శిక్షణార్థుల నమోదు వివరాలను వెల్లడించాలని కోరారు. ముఖ్యంగా వరంగల్ ప్రాంతంలో ఆధునిక సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నారా అనే అంశంపై కేంద్రాన్ని ప్రశ్నించారు. యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న నేపథ్యంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, 3డీ ప్రింటింగ్ వంటి రంగాల్లో శిక్షణ విస్తరణపై చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. పరిశ్రమలతో భాగస్వామ్యాలు, ట్రైనర్ల నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్లపై కూడా వివరాలు తెలియజేయాలన్నారు. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి కేంద్ర సహాయక శాఖా మంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ, రాష్ట్రంలో 301 ఐటీఐలు పనిచేస్తున్నాయని, అందులో వరంగల్‌లో 30 ఉన్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది శిక్షణ పొందగా, వరంగల్‌లో 11,754 మంది శిక్షణ పొందినట్లు వెల్లడించారు. అయితే కీలక అంశమైన కొత్త ఐటీఐలు, ఎన్ఎస్టీఐల స్థాపనపై ఎలాంటి ప్రతిపాదనలు లేవని కేంద్రం స్పష్టం చేసింది. వరంగల్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి కేంద్రం నుంచి సరైన మద్దతు లభించడం లేదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. పీఎం-సేటు పథకం ద్వారా ఐటీఐల అభివృద్ధి జరుగుతోందని కేంద్రం చెప్పినా, రాష్ట్రానికి కొత్త సంస్థలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో, యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించడంలో కేంద్రం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. వరంగల్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

## తేజా రాయపాటి కి ఎఫ్ టీపీసీ

- ఇండియా రైజింగ్ స్టార్ అవార్డు



కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మార్చి 23

యువ నటుడు తేజా రాయపాటి 23 (ఇరవై మూడు) చిత్రంలో తన అద్భుత ప్రతిభను కనబరిచి, ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం నుంచి గద్దర్ అవార్డు ను అందుకున్నారు. అలాగే తెలుగు సినిమా వేదిక సంస్థ నుంచి ఉగాది సినీ నంది పురస్కారం అందుకున్న యువ నటుడు తేజా రాయపాటి ఖాతాలో మరో ప్రతిష్టాత్మక అవార్డు చేరింది. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టీ పీ సీ ఇండియా) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఫిల్మ్ టైకూన్ అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా, తేజా రాయపాటిని రైజింగ్ స్టార్ అవార్డు తో సత్కరించారు. ఈ అవార్డును సంస్థ అధ్యక్షుడు చైతన్య జంగా, కార్యదర్శి విజయ్ వర్మ పాకలపాటి సమక్షంలో, ప్రముఖులు పాతూరి నాగభూషణం, గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. జాతీయ స్థాయి సినీ సంస్థ నుంచి అందుకున్న ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, సందేశాత్మక చిత్రంతో అరంగేట్రం చేసిన తాను, భవిష్యత్తులో కమర్షియల్ చిత్రాలకు కూడా ప్రాధాన్యత ఇస్తానని తేజా రాయపాటి తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 23

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను అందించగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు 127 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సంబంధిత శాఖల వారీగా త్వరగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత అర్జీదారులకు ఆయా శాఖల అధికారులు తెలియజేయాలన్నారు. ఇటీవల జరిగిన దిశా కమిటీ సమావేశంలో వివిధ మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు అంశం గురించి చర్చించడం జరిగిందని, కాజీపేట, హనుమకొండ, ధర్మసాగర్, వేలేరు, హసన్ పర్తి మండలాల తహసిల్దార్లు ఆరోగ్య ఉప కేంద్రాల కోసం స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డి ఆర్ డి ఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ కు ఘన నివాళులు



కరపత్రం ప్రతినిధి వరంగల్ మార్చ్ 23

భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్,రాజ్‌గురు,సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి ఆధ్వర్యంలో స్థానిక భారతి డిగ్రీ కాలేజీలో సోమవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్,కాలేజీ ఛైర్మన్ సంజయ్ హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతి పిన్న వయసులోనే తమ ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.యువత వారి ఆశయాలను అనుసరించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.విద్యార్థులకు దేశభక్తి,సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో విద్యార్థులు,అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీర అమరుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెండ్యాల సతీష్,రాజు,సూర్య,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడి అడ్డుకున్న పోలీసులు

- బీజేపీ నేతల అరెస్టులు ప్రజాస్వామ్యానికి విఘాతం ఎర్రబెల్లి ప్రదీప్ రావు





కరపత్రం ప్రతినిధి వరంగల్ మార్చి 23

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు భారతీయ జనతా పార్టీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సహా పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్రంగా స్పందించారు. శాంతియుతంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం, ఎటువంటి చట్టవిరుద్ధ చర్యలు లేకపోయినా నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించడమేనని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాన్ని అణచివేయడం సరైంది కాదన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే విధంగా పోలీసులు వ్యవహరించడం వెనుక ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టే ప్రయత్నమే ఉందని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం, నిరసనలను అణచివేయడం అసహన రాజకీయాలకు నిదర్శనమని ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు.